క్లుప్తంగా

ప్రమాదబీమా గడువు పెంపు

పార్వతీపురం: కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, అంగవైకల్యం చెందినా వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ–శ్రమ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ఈనెల 31వరకు గడువు పెంచినట్లు ఇన్‌చార్జ్ జిల్లా కార్మిక శాఖాధికారి జి.ఎల్లాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 ఆగస్టు 2021 నుంచి 31 మార్చి 2022 వరకు జరిగిన ప్రమాద బాధితుల పేర్లు నమోదు చేయించాలని, పూర్తి వివరాలకు ఫోన్ 9492555023 నంబరును సంప్రదించాలని సూచించారు. వేసవి దృష్ట్యా కార్మికులు పని ప్రదేశంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పనిప్రదేశంలో తాగునీరు, మజ్జిగ, నీడను కార్మికులకు కల్పించాలని యజమానులకు సూచించారు. వైద్యసిబ్బందితో సమన్వయం చేసుకుని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐఆర్ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని, పనివేళలో మార్పులు చేయాలని చెప్పారు.

మద్యంమత్తులో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రానికి సమీపంలో మండల పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో సాయంత్రం పాఠశాల విడిచి పెట్టే సమయంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో అటుగా వెళ్తున్న విద్యార్థులను అసభ్యకరంగా మాట్లాడుతూ, వెకిలి చేష్టలు చేయడంతో గుర్తించిన స్థానికులు దేహశుద్ధి చేశారు. ఈ మేరకు సమీపంలో ఉన్న ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి రవికుమార్ పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గురువారం నుంచి పాఠశాల విడిచి పెట్టే సమయంలో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

దళితుల నివాసాల సమీపంలో మృతదేహాల ఖననం తగదు



తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

సీతానగరం: దళితుల నివాసాల మధ్య మృతదేహాన్ని ఖననం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం అనంతరాయుడుపేట గ్రామస్తులు తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు ఫిర్యాదు చేశారు. రంగంపేట పంచాయతీ మధుర గ్రామమైన అనంతరాయుడుపేటలో పి.పైడమ్మ మృతి చెందడంతో బుధవారం మృతదేహాన్ని ఎస్సీ కాలనీ సమీపంలో ఖననం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఎస్సీ కుటుంబీకుడు ఆర్.రాము అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు ఎస్సీ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు.


నవోదయ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం గౌరి, ఉపాధ్యాయుల

మక్కువ: మండలంలోని పాయకపాడు ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు నవోదయ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారని ప్రధానోపాధ్యాయురాలు ఎస్.గౌరి బుధవారం తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సీహెచ్ యువన్, టి.గోవర్ధన్ మంగళవారం విడుదల చేసిన ఫలితాలలో ఉత్తీర్ణత సాధించి 6వ తరగతిలో ప్రవేశం పొందారని చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను హెచ్‌ఎం గౌరి, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, సంతోష్ బాబు అభినందించారు.

'రీ'సర్వే చేస్తున్న అధికారులకు సహకరించాలి



ర్యాలీలో మాట్లాడుతున్న హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు

సీతానగరం: మండలంలో రీ సర్వే చేస్తున్న అధికారి సిబ్బందికి సహకరించి, సర్వేపై రైతులు అవగాహన కల్పించుకోవాలని హెచ్‌డీటీ ఎ.ఉమామహేశ్వ రరావు అన్నారు. ఈ మేరకు మండలంలో జరుగుతున్న రీ సర్వేపనుల్లో భాగంగా బుధవారం బళ్లకృష్ణాపురంలో సర్పంచ్ బి.జగన్నాధం ఆధ్వర్యంలో రైతులతో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించి రీ సర్వే చేసి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సర్వే చేస్తున్న వీఆర్వోలు, సర్వేయర్లకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ ఎస్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ డి.సింహాచలం, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ప్రహరీ కొత్తది.. భవనం పాతది



నూతనంగా నిర్మించిన ప్రహరీ మధ్యలోఉన్న పాత భవనం

పార్వతీపురం రూరల్:

ఈ చిత్రంలో కనిపిస్తున్న గోడ నిర్మాణం వెనుక ఉన్న పాత భవనం పెదబొండపల్లి బీసీ కాలనీ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రం. ఈ భవనం పైకప్పు పెంకులతో ఏర్పాటు చేసి దాదాపు 32ఏళ్ల కిందట నిర్మించింది. ఇలాంటి భవనానికి ముక్కుపచ్చలారని పసిపిల్లలు, గర్భిణులు, బాలింతలు తరచూ వచ్చే పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో పాత భవనం స్థానంలో కొత్త భవనాన్ని అంగన్వాడీ కేంద్రం నిర్వహణ నిమిత్తం నిర్మించాల్సింది పోయి అధికారులు శిథిలావస్థకు చేరిన భవనం చుట్టూ లక్షలాది రూపాయలతో ప్రహరీని ఆగమేఘాల మీద నిర్మించడంపై సంబంధిత అధికారుల తీరుపట్ల స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇలాంటి భవనంలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తే ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అసంపూర్తిగా అంగన్వాడీ కేంద్రం నిర్మాణం

ఈ అంగన్వాడీ కేంద్రానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న పాత భవనం వెనుక భాగంలో 2017వ సంవత్సరంలో టీడీపీ హయాంలో మంజూరు చేసిన నూతన భవన నిర్మాణం నిధులు మంజూరు కాక అసంపూర్తిగా నిలిచిపోయింది. తుప్పలు, డొంకలతో అసంపూర్తిగా ఉన్న నిర్మాణం దర్శనం ఇస్తోంది. సంబంధిత అధికారులు సమస్యను గుర్తించడంలో విఫలమయ్యారా? లేక చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నరా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్వాడీ భవనం

సకాలంలో రెవెన్యూ సేవలు అందించాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం రూరల్: రెవెన్యూశాఖ ద్వారా అందించే అన్ని సేవలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే పైలెట్ గ్రామం గోపాలపురం పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసభ నిర్వహించి రైతులందరూ గ్రౌండ్ వాలిడేషన్ సమయంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఫీల్డ్ స్టాఫ్‌ను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న సంబంధిత సేవలపై సమీక్ష నిర్వహించి, అన్ని సేవలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్షలో పార్వతీపురం తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు

సాలూరు రూరల్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాయం ఆవరణలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు రాముడు, శంకర్రావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను కాంట్రాక్టర్ చేతిలో బలిపశువులను చేయడానికి చూస్తోందన్నారు. ఆప్కాస్ రద్దుచేయడానికి ప్రభుత్వ యోచిస్తున్నప్పుడు అంతకంటే మెరుగైన వ్యవస్థను తీసుకువచ్చి కాంట్రాక్ట్ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికులపై బలవంతంగా కాంట్రాక్టర్లను ప్రయోగిస్తే పోరాటానికి వెనుకాడమని హెచ్చరించారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ ఏప్రిల్ 10న పురపాలక శాఖామంత్రి నారాయణకు సంతకాలు సేకరించి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేడుకగా అగ్నిగంగమ్మ జాతర



అగ్నిగంగమ్మను దర్శించుకుంటున్న పట్టణ ప్రజలు

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రజల ఇలవేల్పు అగ్నిగంగమ్మ జాతరను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని పార్వతీనగర్‌లో శ్రీ అగ్నిగంగమ్మ ప్రధాన ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల నుంచి వచ్చిన మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి ఉత్సవ కమిటీ పెద్దలు పట్టు వస్త్రాలను సమర్పించారు. అలాగే ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలో దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

చిన్నారుల సంరక్షణకు అంగన్వాడీలు ప్రాధాన్యం ఇవ్వాలి



శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఎస్.సులేఖ

సీతానగరం: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రవేశించిన 1 నుంచి 6 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారుల సంరక్షణకు అంగన్వాడీ సిబ్బంది ప్రాధాన్యం ఇవ్వాలని బలిజిపేట సీడీపీఓ ఎస్ సులేఖ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని మరిపివలస అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆమె మాట్లాడుతూ విడతల్లో 178 మంది అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. శిక్షణ పొందిన అంగన్వాడీ టీచర్లు చిన్నారులను సంరక్షించడంతో పాటు విద్యనందించడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.పద్మావతి, పూర్ణిమ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఈఈ

కొమరాడ:



కొమరాడలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఈఈ

ప్రభుత్వం నుంచి మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ జి.సోమేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎంఏవై గ్రామీణ పథకాలకు రూ.1.80లక్షల యూనిట్ విలువతో పీఎం జన్‌మన్ పథకానికి రూ.2.39 లక్షల యూనిట్ విలువతో గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో సగానికి పైగా ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వీలైనంత త్వరగా వీటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారులకు అదనపు సాయం చేస్తుందని, వినియోగించుకోవాలని సూచించారు. మే 31లోగా పూర్తి చేయడానికి లబ్ధిదారులకు కావాల్సిన సాయం అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ ఏఈ డి.రాములు, నారాయణరావు తదితరులు ఉన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవిసెలవుల్లో తరగతులు నిర్వహిస్తే సంబంధిత కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.రవికుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తయి పదిరోజులు కూడా పూర్తికాకముందే ద్వితీయ సంవత్సరం సిలబస్ మొదలు పెట్టి తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఐఐటి, జేఈఈ మెయిన్స్, నీట్ పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. క్లాస్‌లు నిర్వహించిన కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

సుస్థిర అభివృద్ధికి సహకరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న సౌత్ ఆసియా రైన్ ఫారెస్టు అలియన్సు సర్టిఫికేషన్ పీఎం నీల్‌కాంత్

గరుగుబిల్లి: ఏడాది పొడవునా పంటలు పండించుకుని సుస్థిర అభివృద్ధి సాధించేందుకు రైతులంతా సహకరించాలని సౌత్ ఆసియా రైన్ ఫారెస్టు అలియన్సు సర్టిఫికేషన్ ప్రాజెక్టు మేనేజర్ నీల్‌కాంత్ పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో మామిడి, జీడి, పసుపు పంటలకు రైన్ ఫారెస్టు అలియన్స్ సర్టిఫికేషన్ చేయు విధానంపై బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గుమ్మలక్ష్మీపురం మండలంలో జీవ ప్రాజెక్టు పరిధిలో 28 గ్రామాలలో ఉన్న ఆదితల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ రైతులు పండించే పంటలు ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ చేసుకొనేందుకు అనువుగా రైన్ ఫారెస్టు అలియన్స్ ధ్రువీకరణకు ఎఫ్‌పీఓ ద్వారా చేపట్టే అవకాశం రావడం రైతులకు ఎంతో శుభపరిణామమన్నారు. స్కూల్ సిలబస్ డవలప్‌మెంట్ సీనియర్ కన్సల్టెంట్ డి.పారినాయుడు, ప్రాజెక్టు అధికారి పి.వినూత్న, డీపీఎం పి.షణ్ముఖరాజు, సిబ్బంది నేపా, శ్రీధర్, రోజా చంద్, ఎస్.ప్రహరాజ్ పాల్గొన్నారు.

కంటైనర్ ఆసుపత్రుల ప్రారంభం



పెద్దగూడ గ్రామంలో కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ పరిధి పెద్దగూడ గ్రామంలో.. కురుపాం మండలంలోని మొండెంఖల్లు పీహెచ్‌సీ పరిధిలోని పోరండంగూడ గ్రామంలో.. కంటైనర్ ఆసుపత్రులను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకు వీటిని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కెవిఎస్.పద్మావతి, వైద్యులు ఎం.బుద్దేశ్వరరావు, అభిలాష, ఎంపీడీఓలు ఎస్.సాల్మన్‌రాజు, జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ ఎన్.శేఖర్ పాల్గొన్నారు.

జీవనోపాధిపై ప్రణాళికలు



నర్సిపురంలో పొదుపు సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

పార్వతీపురం రూరల్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని డీఆర్‌డీఏ సుధారాణి పేర్కొన్నారు. ఈ మేరకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే నెల1 నుంచి రుణాలు అందించడానికి ప్రణాళికలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చిన్న సంఘాల 2025–2026 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక అప్పులు జీవనోపాధి ప్రణాళికల తయారీపై ఏపీఎం, సీసీలకు జిల్లాస్థాయిలో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో పొదుపు సంఘాల మహిళా సభ్యులకు ఎస్‌హెచ్‌జీ వార్షిక ప్రణాళిక యాప్‌లో పొందుపరచాల్సిన వివరాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కులవృత్తులు, జీవనోపాధి, వ్యవసాయ రంగం, చిన్నతరహా వ్యాపారం, కుటీర పరిశ్రమలు, చేనేత రంగం, ఇతర విభాగాలు, చదువు, వివాహం నిమిత్తం రుణాలు మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.సత్యం నాయుడు, డీపీఎం ఫైనాన్స్ అధికారి అప్పారావు, ఏపీఎం సింహాచలం, బ్యాంకుల లింకేజీ ఏపీఎం శివం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏను నియమించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు కె.రామస్వామి తదితరులు

పార్వతీపురం: వీఓఏను నియమించాలని గ్రామైక్య సంఘాలు కోరుతున్నప్పటికీ నియమించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, తక్షణం వీఓఏను నియమించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యుడు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు పట్టణంలోని సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మండలంలోని రావికోన పంచాయతీ అడ్డూరువలస గ్రామానికి వీఓఏను నియమించాలని గత 18 నెలల నుంచి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. రావికోన గ్రామానికి చెందిన 38 మంది మహిళలకు అడ్డూరువలసలో శిక్షణ ఇచ్చారని, శిక్షణ కాలంలో రోజుకు రూ.500 చొప్పున ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు ఏ ఒక్క మహిళకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. డోకిశీల గ్రామానికి చెందిన 35 మహిళలకు కుట్టు మిషన్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల నుంచి కార్యాలయానికి కొనుగోలు చేసిన యంత్రాలు, సామగ్రి, ల్యాప్‌ట్యాప్‌లపైన విచారణ చేపట్టి సంబంధిత వెలుగు ఏపీడీపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ మేధో సంపత్తి హక్కులపై అవగాహన

పార్వతీపురంటౌన్: ఎంఎస్‌ఎంఈ మేధో సంపత్తి హక్కులపై అవగాహన కార్యక్రమం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచ బ్యాంకు ప్రాజెక్ట్ అయిన ఆర్‌ఏఎంపీ పథకం కింద ఏపీఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో మేధో సంపత్తి హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీ సెంటర్ సహకారంతో నిర్వహిస్తోందన్నారు. ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి కోసం అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పేటెంట్లు, ట్రేడ్‌మార్కెట్‌లు, కాపీరైట్‌లు, డిజైన్ల గురించి వివరించడం, ఐఆర్‌పీ ఏవిధంగా పొందాలి? నిర్వహించాలన్న అంశాలపై మార్గదర్శకాలు అందించనున్నట్లు చెప్పారు. ఔత్సాహికులు పాల్గొనవచ్చని, ఎటువంటి ప్రవేశ రుసుము ఉండదని స్పష్టం చేశారు.

అన్నమయ్యకు ఘనంగా నివాళి



అన్నమయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గణపతి మాస్టారు, ప్రజానాట్యమండలి కన్వీనర్ ఈశ్వరరావు

సాలూరు రూరల్: అన్నమయ్య 522వ వర్ధంతి సభ ప్రముఖ తెలుగు ఉపాధ్యాయుడు ఆకుల గణపతి ఆధ్వర్యంలో స్థానిక వెలమపేట కల్యాణ మంటపంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మాస్టారు గణపతి మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలతో ప్రజలు ఎంతో చైతన్యవంతులయ్యారన్నారు.కులమతాలకు అతీతంగా అందరూ ఒక్కటేనని చాటి చెప్పిన మహనీయుడు అన్నమయ్య అని కొనియాడారు. అలాగే ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

పెదంకలాం పీహెచ్‌సీ పరిశీలన



మాట్లాడుతున్న జిల్లా ప్రొగ్రాం అధికారి, డాక్టర్ టి.జగన్మోహనరావు

సీతానగరం: జిల్లాలోని పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు మెరుగుపరిచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ప్రొగ్రాం అధికారి డాక్టర్ టి జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీలో ప్రసవాలు జరగాల్సిన గదులను, ఓపీ గదులు రికార్డులను బుధవారం పరిశీలించారు. ముందుగా ఆస్పత్రికి వచ్చిన రోగుల యోగక్షేమాలను, స్థానికంగా వైద్యులు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్సకు అవసరమైన సూదిమందులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే పీహెచ్‌సీలో జరుగుతున్న ల్యాబ్ పరీక్షలు, ల్యాబ్ పరికరాలు, సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు సకాలంలో వేయాలని చెప్పారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పి.రమ్య సాయి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, గోపి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మవారి అనుపోత్సవం



కోలాహలంగా ఘటాలతో గుడికి వెళ్తున్న భక్తులు

సీతానగరం: మండలంలో వారం రోజులుగా జరుగుతున్న బూర్జ పెద్దమ్మవారి జాతర అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కొత్త బూర్జ, పాత బూర్జ, ఆవాలవలసలో అనుపోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అమ్మవారి అంగడి నుంచి గుడివరకూ బాజాభజంత్రీలతో తిరువీధిగా పయన మై వనం గుడివద్ద వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఉపాధి చెల్లింపుల్లో అవకతవకలు

- సోషల్ ఆడిట్‌లో వెలుగుచూసిన సిబ్బంది నిర్లక్ష్య ధోరణి



జాతీయ గ్రామీణ ఉపాధి పనులపై ఆడిట్ చేస్తున్న పీడీ రామచంద్ర రావు

సాలూరు రూరల్: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతనాల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలు బుధవారం జరిగిన సోషల్ ఆడిట్‌లో వెలుగుచూశాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీడీ రామచంద్రరావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 29 పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పనుల బిల్లుల చెల్లింపుల విషయంలో కూలీల సంతకాలు వేలిముద్రలు లేకుండా డబ్బులు జమచేసినట్లు అధికారుల పరిశీలనలో వెలుగుచూసింది. ప్రతి గ్రామ పంచాయతీలో రెండు నుంచి నాలుగు కేసులు బయటపడుతున్నాయి. అలాగే ఉపాధి పథకంలో నాటిన మొక్కలు పూర్తిగా చనిపోవడంతో వాటికి సంబంధించిన డబ్బులు కూడా రికవరీ చేస్తున్నట్లు పీడీ రామచంద్ర రావు స్పష్టం చేశారు. రికవరీతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన పొరపాటుకు ఫైన్లు కూడా వేయనున్నట్లు తెలిపారు. అవకతవకల్లో బాధ్యులైన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ ఎంత అనేది తరువాత తెలియజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, వైస్‌ఎంపిపి రెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.